క్లుప్తంగా

ఇల్లెందు - నర్సంపేట బస్సు సర్వీస్

ఇల్లెందు: ఇల్లెందు బస్ డిపో నుంచి నర్సంపేటకు ప్రతీరోజు రెండు సర్వీసులు నడపనున్నారు. ఈ మేరకు శుక్రవారం కొత్తగూడెం డిపో మేనేజర్ ఎస్.రాజ్యలక్ష్మి బస్సు సర్వీసులను ప్రారంభించారు. మాట్లాడుతూ రోజూ ఉదయం 7 గంటలకు, 11.45 గంటల బస్సులు బయలుదేరుతాయని చెప్పారు.

15 శాతం రిజర్వేషన్ కల్పించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏజెన్సీలోని ఎస్సీలకు ఆర్టికల్ 14, 15 (4), 16(4) సమాన వాటా న్యాయసూత్రం ప్రకారం జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో 15 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు శుక్రవారం హైకోర్టు లాయర్ గద్దం రాము, మాదిగ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు వినతిపత్రం అందజేశారు.

మానవహారం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. ఫహీమ్ దాదా, ఖయ్యూం, ఉపేందర్, భూపేష్, ప్రసాద్, పాషా పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్ర చేశాయి'

పాల్వంచరూరల్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల కుట్రల కారణంగా స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు తాత్కాలికంగా నిలిచిపోయాయని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జగన్నాథపురం గ్రామంలో శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండం వెంకన్న, బాలినేని నాగేశ్వరరావు, బాదర్ల జోషి, చింత నాగరాజు పాల్గొన్నారు.

వనమహోత్సవం

సుజాతనగర్: ఇండియన్ స్కాట్ అండ్ గైడ్ ఫెలోషిప్ (ఎస్‌జీఎఫ్) కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వేపలగడ్డ గ్రామంలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. సింగరేణి జనరల్ మేనేజర్ (వెల్ఫేర్ అండ్ పర్సనల్) కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. సింగరేణి రిటైర్డ్ జీఎం బసవయ్య, ఎస్‌జీఎఫ్ ఇంటర్నేషనల్ కార్యదర్శి మ్యాక్ మిక్కీ, జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సుజాతనగర్: సుజాతనగర్ 33 /11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుతుందని ఏఈ కిషన్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు ఏడీఈ హేమచంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగబిషన్ బస్తీ, ప్యూన్ బస్తీ, ఏ పవర్‌హౌస్ బస్తీ, రామవరం, 2ఇంక్లైన్, గరిమెళ్లపాడు, ఎస్‌సీబీ నగర్, చిట్టి రామవరం, బర్మా, బాబుక్యాంప్, బర్లీఫీట్, సన్యాసి, మధురబస్తీ, బస్టాండ్ ఏరియా, రామాంజనేయ, రాంనగర్, విద్యానగర్ కాలనీ, పోస్టాఫీస్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నేడు పీఎం ధన్ ధాన్యకృషి యోజన

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రధానమంత్రి ధన్ ధాన్యకృషి యోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే శాస్త్రవేత్త బి.శివ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, డీఏఓ ముఖ్యఅతిథులుగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ఖైరతాబాద్ అబ్జర్వర్‌గా నాగా సీతారాములు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ పీసీసీ అబ్జర్వర్లను, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ గురువారం వెల్లడించారు. 33 జిల్లాలతో పాటుగా మున్సిపల్ కార్పొరేషన్‌లకు 22 మందిని ఏఐసీసీ అబ్జర్వర్లతో పాటుగా 84 మంది పీసీసీ అబ్జర్వర్లను ప్రకటించింది. ఇందులో సుజాతనగర్‌కు చెందిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములును ఖైరతాబాద్ అబ్జర్వర్‌గా ప్రకటించినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతికి ప్రత్యేక రైలు నడపాలి

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలంలో శ్రీసీతారాముల దైవ దర్శనానికి స్పెషల్ ట్రైన్‌లో శుక్రవారం కొత్తగూడెం వచ్చిన రైల్వే డివిజనల్ మునేజర్ గోపాలకృష్ణయ్యకు సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు డీఆర్‌ఏసీసీ మెంబర్ వై.శ్రీనివాస రెడ్డి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం, కొత్తగూడెం మీదుగా కలియుగ దైవంగా విరాజిల్లుతున్న తిరుపతి పుణ్యక్షేత్రానికి రైల్వే అధికారులు ఇచ్చిన హామీ మేరకు స్పెషల్ ట్రైన్ నడిపించాలని చెప్పారు.

జీపీ ఆస్తులపై సర్వే..

- ప్రత్యేక యాప్‌లో నమోదు
- 21 అంశాలపై వివరాల సేకరణ
- సమస్యలతో గ్రామాలు సతమతం

చుంచుపల్లి: గ్రామ పంచాయతీల్లోని ప్రభుత్వ ఆస్తులు, మౌలిక వసతులపై సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రత్యేక జీపీ మానిటరింగ్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ యాప్‌లో గ్రామ పంచాయతీల ఆస్తులు, ప్రస్తుతం ఉన్న మౌలిక వసతుల వివరాలను నమోదు చేయనున్నారు. దీంతో మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో వివరాలు సేకరించేందుకు కార్యదర్శులు సిద్ధమయ్యారు. సర్పంచుల పదవీకాలం ముగిసి ఏడాదిన్నర దాటుతోంది. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు 2024 ఫిబ్రవరి నుంచి బాధ్యతలు చేపట్టారు. పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు నుంచి రావడం లేదు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ ముఖ్యం. చెత్త సేకరణకు వినియోగించే ట్రాక్టర్లకు డీజిల్‌తో పాటు వాటి మరమ్మతులు చేపట్టడానికి కార్యదర్శులు సొంతంగా వారానికి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వెచ్చిస్తున్నారు. వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, తాగునీటి వసతి, బోర్ల మరమ్మతులు, పైపులైను లీకేజీలు తదితర పనులకు నెలకు రూ.10 వేలకు పైగానే ఖర్చవుతున్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిత్యం ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. త్వరలో ఎన్నికలు నిర్వహించాల్సిన నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో ఆస్తులు, మౌలిక వసతులపై సర్వే నిర్వహించడం కొంత ప్రాధాన్యం సంతరించుకుంది.

21 అంశాలపై వివరాల సేకరణ...

రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సర్వేలో 21 అంశాలకు సంబంధించి సమగ్ర మౌలిక వసతుల వివరాలను సేకరించనున్నారు. పంచాయతీ కార్యదర్శులు వినియోగిస్తున్న జీపీ మానిటరింగ్ యాప్‌ను నవీకరించి సర్వేకు సంబంధించిన వివరాలను పొందుపర్చారు. మండలంలోని బాబూక్యాంపు, వెంకటేశ్వర, రామాంజనేయకాలనీ, విద్యానగర్, ఎస్‌కే నగర్, చుంచుపల్లితండా, నందాతండా, పెనుబల్లి, ప్రశాంతినగర్, 3ఇంక్లైన్,4 ఇంక్లైన్, రుద్రంపూర్, గౌతంపూర్, ధన్‌బాద్, పెనగడప, అంబేద్కర్‌నగర్ కాలనీ, రాంపురం, వెంకటేష్‌ఖని పంచాయతీల్లో సర్వే చేపట్టనున్నారు. కార్యదర్శులు గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్, సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీ, పాఠశాల, వైకుంఠధామం, సామాజిక ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఆరోగ్య కేంద్రాలు, పల్లె ప్రకృతి వనం, సీసీ రోడ్లు, అనుబంధ గ్రామాలకు లింకు రోడ్లు, వీఓ భవనం, క్రీడా ప్రాంగణం, వరద కాల్వలు, మురుగు కాల్వలు, తాగునీరు, వీధి దీపాలు, పశువులకు నీటి తొట్టెలు, గ్రంథాలయాలను పరిశీలించి అందులో ఉన్న వసతుల వివరాలు సేకరించనున్నారు. ఈ సర్వేతో పంచాయతీల్లో ఉన్న ప్రభుత్వ ఆస్తుల్లో ఎలాంటి వసతులున్నాయి. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా..? ప్రజల అవసరాలు, కల్పించాల్సిన వసతులు ఏంటనేది లెక్క తేలుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



పెనగడప గ్రామపంచాయతీ కార్యాలయం





యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న బాబూక్యాంపు పంచాయతీ కార్యదర్శి

వివరాలు నమోదు చేస్తున్నాం...



ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల పరిధిలోని ఆస్తులు, మౌలిక వసతుల వివరాలను సేకరిస్తున్నాం. ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నాం. ప్రధానంగా ప్రభుత్వ భవనాలు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, రోడ్లు, ప్రకృతి వనాలు, తాగునీటి వసతులు వంటివి నమోదు చేస్తున్నాం. సమగ్ర వివరాలను సేకరించి యాప్‌లో ఆన్‌లైన్ చేస్తున్నాం.

– హనుమంతు, కార్యదర్శి, పెనగడప

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి..

సుజాతనగర్: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదని ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగపేట గ్రామంలో శనివారం 40 మంది ఆటో డ్రైవర్లు వివిధ యూనియన్ల నుంచి ఏఐటీయూసీలో చేరారు. జమలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లకు కిరాయిలు లేక కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దీపావళి పండుగ లోపుగా వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కొమారి హనుమంతరావు, భూక్యా దస్రు, కృష్ణ, భాగం శేషభూషణం, భాగం కృష్ణ, మూడ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐటీయూసీ జెండా ఎగురవేస్తున్న జమలయ్య

రిజర్వేషన్లను అడ్డుకోవడం గర్హనీయం

కొత్తగూడెంఅర్బన్: బహుజన సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ తాండ్ర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీలో మద్దతు తెలిపి, కోర్టుల ద్వారా అడ్డుకోవడం గర్హనీయమని, 70 సంవత్సరాలుగా బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. కార్యక్రమంలో మల్లెల రామనాథం, అంకినీటి ప్రసాద్, వీరభద్ర, భిక్షపతి, సర్వేశ్, జి.నాగయ్య, పూల రవీందర్, రామాచారి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యాన్ని రక్షించుకోవాలి



కొత్తగూడెంఅర్బన్: సింగరేణి నర్సింగ్ కళాశాలలో



ఇల్లెందు: విద్యార్థులతో జడ్జి కీర్తిచంద్రికారెడ్డి

కొత్తగూడెంటౌన్: ప్రతీ వ్యక్తి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చుంచుపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం ప్రపంచ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ప్రస్తుత సమాజంలో జీవనశైలి మారిపోయిందని, మానసిక ఒత్తిడిని జయించాలంటే ఆందోళనలకు దూరంగా ఉండాలన్నారు. ఆహారపు అలవాట్లను మార్చుకుని ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పురుషోత్తంరావు, పి.నిరంజన్‌రావు, సాహితి, ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థినులు మానసిక రుగ్మతలపై అవగాహన పెంచుకోవాలని సింగరేణి ప్రధానాస్పత్రి సైకియాట్రిస్ట్ విశ్వమేధి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆస్పత్రిలో నర్సింగ్ స్టూడెంట్స్‌కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లలిత, ప్రిన్సిపాల్ రేణుక, ఫ్యాకల్టీ లలితలక్ష్మి, రెహానా, నాగహేమ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: మానసికంగా స్థిరంగా ఉన్న వ్యక్తులు మాత్రమే జీవితంలో విజయాలు సాధించగలుగుతారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మ అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించి, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు డాక్టర్ టి.అరుణకుమారి, ఎస్.స్వరూపరాణి, వైస్ ప్రిన్సిపాల్ జె.మాధవి, శ్రీనివాసరావు, భానుప్రవీణ్, లీల, సౌమ్య, షహనాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఇల్లెందు: మానసిక రోగుల పట్ల ఉదారత ఉండాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి డి.కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇల్లెందులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ మానసిక ఇబ్బందులతో ఉన్నవారికి సహాయం కోసం 14416 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని, వారిని సంరక్షణ కేంద్రానికి తరలిస్తారని తెలిపారు.

'అసాధ్యమైన జీఓలతో ఆడుకుంటున్నారు'

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చి తమిళనాడు తరహాలో చట్టం చేస్తే తప్ప బీసీ రిజర్వేషన్ సాధ్యం కాదని తెలిసి కూడా బీసీ రిజర్వేషన్ మీద కాంగ్రెస్ డ్రామాలు చేసిందని బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యులు, మాజీ గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్ ఆరోపించారు. శుక్రవారం ఇల్లెందులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ అవకాశం కల్పిస్తామని అడ్డగోలు జీఓలు ఇచ్చిందని, 60 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు బీసీలు ఇప్పుడు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. ఎన్నికలు ఎలాగైనా నిర్వహిస్తామని అవసరమైతే పార్టీ పరంగా రిజర్వేషన్‌తో ముందుకెళ్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడెందుకు వెనక్కు తగ్గారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఎస్.రంగనాథ్, అబ్దుల్‌నబీ, ఎండీ జబ్బార్, లలిత్ కుమార్ పాసీ, కడకంచి వీరస్వామి, రవి, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దిండిగల రాజేందర్

జూలూరుపాడు: స్థానిక ఎన్నికలు నిర్వహించే దమ్ము లేకనే రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలాడుతోందని బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు విమర్శించారు. శుక్రవారం జూలూరుపాడులో మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ పేరుతో బీసీలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెపుతారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ అరుణకు సేవారత్న అవార్డు

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో హిందీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.అరుణకుమారికి ప్రతిష్టాత్మకమైన మహాత్మగాంధీ సేవా రత్న పురస్కారం లభించింది. హిందీ భాష, విద్యార్థుల అభివృద్ధి, హిందీ సాహిత్య పరిశోధనలో ఆమె చేస్తున్న కృషిని గుర్తించి ఉత్తర్‌ప్రదేశ్‌లోని రుషి వైదిక విద్యాపీఠం సంస్థ అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

పింఛన్ ఇప్పించండి మహాప్రభో..



పరిటాల లింగమ్మ

సుజాతనగర్: సింగభూపాలెం గ్రామానికి చెందిన పరిటాల లింగమ్మ వయస్సు 80 ఏళ్లు. భర్త 8 ఏళ్ల క్రితం మృతి చెందాడు. వృద్ధాప్య పింఛన్ కోసం పలుమార్లు దరఖాస్తు చేసినా మంజూరు కాలేదని చెబుతోంది. ఇదిలా ఉండగా వేలిముద్రలు పడకపోవడంతో రేషన్ బియ్యం కూడా ఇవ్వడం లేదని తెలిపింది. మనవళ్లు, మనవరాళ్ల సాయంతో జీవనం గడుపుతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తోంది. అధికారులు స్పందించి పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంటోంది.

పెంచిన ఫీజులు తగ్గించాలి

సింగరేణి(కొత్తగూడెం): పెంచిన డిగ్రీ ఫీజులు వెంటనే తగ్గించాలని, ఫీజుల పేరుతో విద్యార్థులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయొద్దని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వి.విజయ్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అరుణ్, నరెందర్, లోకేష్, చంటి, లోహిత, నందిని, దక్షిత, సుబ్బలక్ష్మి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

అంగన్‌వాడీ కేంద్రంలోనే భోజనం చేయండి..



చుంచుపల్లి: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

కొత్తగూడెంటౌన్: బాలింతలు, గర్భిణులు, పిల్లలు అందరూ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఒక పూట భోజనం చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. శుక్రవారం చిట్టి రామవరంలోని అంగన్‌వాడీ 1, 2 సెంటర్‌లో పోషణమాసోత్సవా నిర్వహించారు. సూపర్‌వైజర్ పాల్గొని పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రసాన చేయించారు. మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో దొరికే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తినాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రక్తం పెరగాలంటే పప్పు దినుసులు, ఆకుకూరలు ఎక్కువగా తినాలని చెప్పారు. మన అంగన్‌వాడీ కేంద్రంలో ఒక్కపూట భోజనం, పాలు, గుడ్డు, ఆహారం తినాలని. కిశోర బాలికలు పల్లీచిక్కిలు రోజుకు ఒకటి మాత్రమే తినాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, శ్రీదేవి, తులసీబాయ్ బస్తీ దావఖానా డాక్టర్ ఝాన్సీరాణి, వెల్ఫేర్ మీనా, కళ్యాణి, భవానీ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

చుంచుపల్లి: లక్ష్మీదేవిపల్లి – 7 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణమాసంలో భాగంగా సామూహిక సీమంతం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్వంచ సీడీపీఓ లక్ష్మీప్రసన్న తల్లులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, డాక్టర్ నూరీ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: తోగ్గూడెం తండాలోని అంగన్‌వాడీ కేంద్రం మోడల్ న్యూట్రీ కిచెన్ గార్డెన్‌ను ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, సీడీపీఓ లక్ష్మీప్రసన్న శుక్రవారం సందర్శించారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక రింగ్‌లలో ఆరు రకాల ఆకుకూరలు, సొర, బీర, బెండకాయల విత్తనాలను విత్తారు. రసాయన ఎరువులను వినియోగించకుండా సేంద్రియ ఎరువులను వినియోగించి ఆదర్శంగా నిలవాలన్నారు.

వర్కర్ల సమ్మెపై పాలకుల నిర్లక్ష్యం వీడాలి

ఇల్లెందురూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్, ఆశ్రమ పాఠశాలల వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 29వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా రొంపేడు, బొజ్జాయిగూడెం, చెన్నంగులగడ్డ ఆశ్రమ పాఠశాలలు, ఉమెన్స్ హాస్టల్ వద్ద ధర్నా చేపట్టారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా వెట్టిచాకిరీ చేయించుకున్న ప్రభుత్వం బకాయి వేతనాల చెల్లింపు, విధుల క్రమబద్ధీకరణ విషయంలో వర్కర్ల సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వాపోయారు. కార్యక్రమంలో వర్కర్లు రామకళ, లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ, పద్మ, స్వరూప, రమణ పాల్గొన్నారు.

టేకులపల్లి: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న డైలీవేజ్, పీఎంహెచ్ హాస్టళ్లలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎట్టి ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నెల 12న ప్రారంభమైన సమ్మె 29 రోజులుగా కొనసాగుతోంది.



టేకులపల్లి: గంగారం ఆశ్రమ పాఠశాల వద్ద సమ్మె చేస్తున్న డైలీవేజ్ వర్కర్లు

ఈ మేరకు శుక్రవారం టీపీఎఫ్ ఆధ్వర్యంలో గంగారం ఆశ్రమ పాఠశాల వద్ద జరుగుతున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. మాట్లాడుతూ పాత పద్ధతిలోనే కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, జీఓ 64 అమలు నిలిపివేయాలి కోరారు. గతంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జీఓ 64 అమలు చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారని, దీని ఫలితంగా వర్కర్ల వేతనాలు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వాలీ, సీతమ్మ, బిజ్జ లక్ష్మయ్య, కోరం సమ్మక్క, కంగల సరిత, జోగ ముత్తమ్మ పాల్గొన్నారు.

బోధనలో ప్రయోగం లేదు

- బీరువాల్లో మూలుగుతున్న పరికరాలు
- గదులు, రసాయనాల కొరత
- నిర్వహణ లేక నామమాత్రంగా డిజిటల్ పాఠాలు

ఇల్లెందురూరల్: సైన్స్ నిర్లక్ష్యానికి గురవుతోంది. శాస్త్ర విజ్ఞానంపై అవగాహన పెంపొందించే ఈ సబ్జెక్టు పాఠశాలల్లో నామమాత్రమైంది. ఆరో తరగతి నుంచే విద్యార్థులకు పరిజ్ఞానం పెంపొందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రయోగశాలలు, డిజిటల్ బోధన సామగ్రి నేడు అలంకారప్రాయంగా మారిపోయాయి. ప్రయోగ పరికరాలు తుప్పు పట్టి బీరువాలకే పరిమితమవుతున్నాయి. నిర్వహణ లేక మండలంలోని చాలా పాఠశాలల్లో డిజిటల్ బోధన మొక్కుబడి మారింది.

అత్తెసరు నిధులతో ఎలా..?

పాఠశాల నిర్వహణకు విడుదలయ్యే స్కూల్ గ్రాంటు నిధుల నుంచి ప్రయోగశాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలని నిబంధన ఉంది. కానీ చాలా పాఠశాలల్లో వాటి జోలికి వెళ్లడం లేదు. ప్రస్తుతం మంజూరవుతున్న నిధులు పాఠశాల నిర్వహణకే సరిపోవడం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. ఇదిలా ఉండగా 2011లో ప్రతీ పాఠశాలలో సైన్స్ ప్రయోగశాల ఉండాలని అప్పటి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ప్రతీ పాఠశాలలో ప్రత్యేకంగా సైన్స్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20వేల నిధులతో ల్యాబ్ సామాగ్రి, రసాయనాలను కొనుగోలు చేశారు. దీంతో ప్రయోగాలు కొంతకాలం సాఫీగా సాగాయి. కానీ ఆ తరువాత నిధుల మంజూరు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రయోగాలు మరిచారు.

భారంగా డిజిటల్ బోధన.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మక బోధనకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం మూడేళ్ల క్రితం 8, 9, 10 తరగతులకు డిజిటల్ బోర్డులను మంజూరు చేసింది. విద్యుత్ సౌకర్యం లేని సమయంలోనూ బోధన సాఫీగా సాగేలా ప్రతీ పాఠశాలకు ఇన్వర్టర్‌ను కూడా మంజూరు చేసింది. కానీ నిర్వహణ లోపాల కారణంగా బ్యాటరీలు పనిచేయడం లేదు. దీంతో కేవలం విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మాత్రమే బోధన కొనసాగిస్తున్నారు.

బీరువాల్లో బందీ..

ప్రయోగశాలల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం, నిర్వహణలో విద్యాశాఖ అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాక్టికల్ విద్య అందని ద్రాక్షగా మారింది. గతంలో ప్రకృతిలో కనిపించే పూలు, మొక్కలు, జలచరాలు వంటి వాటితో ఉపాధ్యాయులు ప్రయోగ పద్ధతిలో కళ్లకు కట్టేలా బోధన చేసేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. మైక్రోస్కోప్‌లు, స్ప్రింగ్ త్రాసులు, స్క్రూగేజీ, వెర్నియర్ కాలిపర్స్ వంటి సామగ్రి బీరువాలకే పరిమిమతమవుతోంది. రసాయనాల పేర్లను చదవడం మినహా వాటిని వినియోగించి ప్రయోగాలేవీ విద్యార్థులు తెలుసుకునే వీలు లేకుండా పోతోంది. ఈ కారణంగా విద్యార్థులను పాఠ్య పుస్తకాలతో కుస్తీ పట్టడం తప్పిస్తే ప్రయోగాలతో అవగాహన రావడం లేదు.

పర్యవేక్షణ ఏదీ..?

సైన్స్ సబ్జెక్టుపై విద్యార్థులు పట్టు సాధించేలా ప్రతీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఒక భౌతికశాస్త్ర, ఒక జీవశాస్త్ర ఉపాధ్యాయుడిని నియమించారు. వారు మూస పద్ధతిలో కాకుండా ప్రతీ అంశాన్ని ప్రయోగాత్మకంగా బోధించేలా అవసరమైన ప్రయోగశాలలు, దృశ్యరూపకంగా బోధించేందుకు డిజిటల్ బోర్డులు సమకూర్చారు. కానీ తనిఖీ సమయంలో ఉన్నతాధికారులు ఆయా అంశాల కంటే పాఠశాలల్లో తరగతి గదులు, మూత్రశాలలు, మైదానం, మధ్యాహ్న భోజనం, యూనిఫాం వంటి విషయాలపై మాత్రమే ఆరా తీస్తున్నారు. ఇవన్నీ విద్యార్థులకు అవసరమైనవే అయినా తరగతి గదిలో పాఠ్యాంశాల బోధన ఎలా సాగుతోంది.. ప్రయోగాత్మ, డిజిటల్ బోధన ఆశించిన ఫలితాలనిస్తున్నాయా.. వంటి విషయాల పరిశీలనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. దీంతో ఎక్కువ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనకే ప్రాముఖ్యతనిచ్చి సిలబస్ పూర్తి చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇది ప్రతీ పాఠశాలలోనూ ప్రయోగాత్మ, డిజిటల్ బోధన సాఫీగా సాగినప్పుడే సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో అలవడుతుంది.



బీరువాలో సైన్స్ ప్రయోగ సామగ్రి



సుభాష్‌నగర్ హైస్కూల్‌లో పనిచేయని బ్యాటరీలు